మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చర్యలు

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్, జనవరి 17 : మీర్‌పేట్ హెచ్ బీకాలనీ డివిజన్ ప్రజలకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే డివిజన్ పరిధిలోని ఎన్టీ ఆర్‌నగర్‌లో కార్పొరేటర్లు జె. ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాలమైన స్థలంలో స్పోర్ట్స్ కాప్లెక్స్ ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి. శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు రవీందర్, ఉమామహేశ్వరి, రూప, ఏఈలు లింగారావు, భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, నాయకులు భాస్కర్, నర్సింహగౌడ్, రాకేశ్, ప్రసాద్‌గౌడ్, వేణుగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటాచారి, శ్రీనివాస్, శ్యామ్, విజయ్, అంజి, అహ్మద్ గోరి, సంజయ్, కృష్ణ, ప్రవీణ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన నాచారం దళిత సంఘాల నాయకులు

రామంతాపూర్ : దళిత పీహెచ్‌డీ స్కాలర్ పులివర్తి దీప్తి మరణానికి కారణమైన వారిపై చర్యలకు చొరవ చూపాలని నాచారం దళిత సంఘాల నాయకులు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కోరారు. దీప్తి మరణించి 30 రోజులు గడిచినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాచకొండ కమిషనర్ దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర డీజీపీ జితేందర్ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దళిత సంఘాల జేఏసీ నాయకులు నల్లా రాధాకృష్ణ, కారపాక అంజి, ప్రమోద్‌కుమార్, వేముల హరిబాబు, నాగరాజు, శివకుమార్, అశోక్‌బాబు తదితరులు ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తాం..

● మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, జనవరి 17: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి కృషి చేస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 4.94 లక్షల విలువైన చెక్కులను అల్వాల్ సర్కిల్‌కు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి, అల్వాల్‌లోని ప్రభుత్వ దవాఖానల్లో ప్రైవేటుకు దీటుగా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలకు అన్ని విధాలా అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ సబితాకిశోర్, అనిల్‌కిశోర్, శరణ్‌గిరి, రహ్మత్‌ఖాన్, సురేశ్, రజక్ తదితరులు పాల్గొన్నారు.

20న జాబ్‌మేళా

మేడ్చల్, జనవరి 17 : నగరంలోని విజయనగర్ కాలనీలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాతో పాటు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా సైతం జరుగుతుందని, ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ పూర్తయిన వారు అర్హులని పేర్కొన్నారు. పలు బహుళజాతి సంస్థలు మేళాలో పాల్గొంటున్నాయని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

చర్లపల్లి డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

చర్లపల్లి, జనవరి 17 : డివిజన్ పరిధిలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం చర్లపల్లి డివిజన్ రెడ్డికాలనీలో కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ యూజీడీ లైన్స్‌కు సంబంధించి నిధులు కేటాయించాలని జలమండలి ఎండీని కోరినట్లు తెలిపారు. ఇందుకు ఎండీ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఆమె పలువురు నాయకులు ఉన్నారు.

'ఆరోగ్యమే మహాభాగ్యం'

కేపీహెచ్‌బీ కాలనీ : ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలంతా ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీనుబాబు అన్నారు. హైవే భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీలోని ఆర్టీఏ కార్యాలయంలో సిబ్బంది,వాహనదారులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చక్కని ఆరోగ్యానికి మితాహారం తీసుకుని, నిత్యం నడక, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనదారులు, బాటసారులందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీఏ ఆఫీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

కాప్రా డివిజన్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

● త్రిపుల్ ఆర్ పేరుతో పాత సామగ్రి సేకరణ

కాప్రా డివిజన్‌లో పాత వస్తుసామగ్రిని సేకరిస్తున్న శానిటేషన్ సిబ్బంది

కాప్రా, జనవరి 17: కాప్రా సర్కిల్‌లో చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్-2024 కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని డిప్యూటీ కమిషనర్ డి.జగన్ పిలుపునిచ్చారు. డీసీ ఆదేశాల మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని సీఎస్‌నగర్, మల్లికార్జుననగర్, శివసాయినగర్ కాలనీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రత్యేక వాహనంతో త్రిపుల్ ఆర్(రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్) పేరుతో సిబ్బంది పాత వస్తుసామగ్రిని సేకరించారు. ఇండ్లనుంచి పాత ఎలక్ట్రానిక్ వస్తువులు, పాత పుస్తకాలు, బట్టలు, సైకిళ్లు, ప్లాస్టిక్ బాటిళ్లు సేకరించారు. ఈ సామగ్రిని సాకేత్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ త్రిపుల్ ఆర్ సెంటర్‌కు తరలించారు. అదేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పూజ, జగదీశ్, శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్ కృష్ణ, అశోక్,ఎస్ఎఫ్ఏ అంజలి, అరవింద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు అటంకం కలిగించిన వారిపై కేసు

జవహర్‌నగర్, జనవరి 17: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడమే కాకుండా... వాటిని కూల్చివేసేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారుల విధులకు అటంకం కలిగించిన రామునాయక్, శేఖర్‌లపై జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సర్వే నెంబర్ 702లో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని అధికారులకు సమాచారం అందింది. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్ఐ రమేశ్, సిబ్బందితో కలిసి నిర్మాణాలను కూల్చివేసేందుకు వెళ్లారు. ప్రభుత్వ అధికారులను అడ్డుకుని విధులకు అటంకం కలిగించిన రామునాయక్, శేఖర్‌పై తహసీల్దార్ సుచరిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వర్గీకరణ చేయకపోతే సర్కారుకు చావు డప్పే..

బొల్లారం, జనవరి 17: ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగబోయే వేల గొంతులు-లక్ష డప్పులు దండోరా సాంస్కృతిక మహ ప్రదర్శనను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారులు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ జిల్లా నుంచి డప్పు కళాకారులు కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని ఆదర్శనగర్ నుంచి రథయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారులు ఆదర్శనగర్ బస్తీవాసులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాయకుడు ఏపూరి సోమన్న మాట్లాడుతూ డప్పు చప్పుళ్లతోనే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులను ఓడిద్దామని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహంకాళీ శ్రావణ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న 'వేల గొంతులు-లక్ష డప్పుల' ప్రదర్శనకు మాదిగ సైన్యం లక్షలాదిగా డప్పులతో తరలివచ్చి పాలకుల గుండెల్లో దరువులు వేయాలని పిలుపునిచ్చారు. వర్గీకరణపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డప్పు మల్లికార్జున్ మాదిగ, కంటోన్మెంట్ ఇన్‌చార్జి అజిత్ కళ్యాణ్, శ్రీకిషన్, దుబ్బ మురళి, ఈఆర్ బాల్‌రాజు, మిలిట్రీ రమేశ్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

27న సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

కీసర, జనవరి 17: మేడ్చల్ జిల్లాలో ఈనెల 27న నిర్వహించే 'లక్ష డప్పులు.. వేల గొంతులు' సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ అన్నారు. చీర్యాల్‌లోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం వద్ద శుక్రవారం ఎమ్మార్పీఎస్ కీసర మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయ్ మాదిగ మాట్లాడుతూ.. మహజన నేత మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వచ్చే నెల ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'లక్ష డప్పులు.. వేల గొంతులు' మహాప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఈనెల 27న సన్నాహక సమావేశాన్ని ఘట్‌కేసర్‌లో నిర్వహిస్తున్నందున మాదిగ సోదరులంతా డప్పులతో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బక్కని కుమార్, ప్రధాన కార్యదర్శిగా గణేశ్, ఇతర కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీ. శంకర్, బుడిగే జగన్, రాజలింగం, బాల్‌రాజ్, రమేశ్, రాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కీసర మండల నూతన కమిటీ సభ్యులు

ఉద్యమకారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

చిక్కడపల్లి, జనవరి 17: వచ్చే బడ్జెట్‌లో ఉద్యమకారులకు నిధులు కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారులు జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలో జేఏసీ నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. రానున్న మార్చి బడ్జెట్‌లో తెలంగాణ ఉద్యమకారులకు, అమరుల, కళాకారుల కుటుంబాల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు 30వేల పెన్షన్, నాలుగు గదుల ఇళ్లు, 250 గజాల స్థలం హామీలు అమలు చేయాలన్నారు. సమావేశంలో ప్రఫుల్‌రాం రెడ్డి, సోమన్న, చంద్రుడు పాల్గొన్నారు.

సాగులో లేని భూముల గుర్తింపునకు ప్రత్యేక సర్వే

● అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయంలో భూ సర్వేను కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 17: సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ రెవెన్యూ కార్యాలయంలో ఆయా భూముల గుర్తింపు విధానాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటివరకు గుర్తించిన సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను కంప్యూటర్‌లో పరిశీలించారు. రెవెన్యూ, అగ్రికల్చరల్ సిబ్బంది సమన్వయంతో సర్వే జరుపుతున్నట్లు చెప్పారు. ఈనెల 20 వరకు సర్వే పూర్తవుతుందని, సర్వేలో గుర్తించిన సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను 21న గ్రామ సభలు నిర్వహించి అభ్యంతరాలు తీసుకుంటామన్నారు. సాగుకు యోగ్యం కాని గుట్టలు, వెంచర్లు, రోడ్లు, గోదాములు, ఇతరత్ర కేటాయించిన భూములను రైతు భరోసా నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ డీఎస్ రజినీ, మండల వ్యవసాయాధికారి ఎంఏ బాసిత్, రెవెన్యూ, అగ్రికల్చరల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం..

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ అమర్‌సింగ్, డిప్యూటి మేయర్ శివకుమార్‌గౌడ్, తదితరులు

పీర్జాదిగూడ, జనవరి17: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం పలు డివిజన్లలో మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రతి డివిజన్లలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కమిషనర్ త్రిశ్వేర్‌రావు, కార్పొరేటర్లు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఓపెన్ జిమ్ పరికరాలను బాగు చేయించండి'

శిల్పారామం వద్ద ఓపెన్ జిమ్‌లో ధర్నా నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ నాయకులు

రామంతాపూర్, జనవరి 17 : శిల్పారామం వద్ద ప్రభుత్వ ఓపెన్ జిమ్‌లో పాడైపోయిన వ్యాయామ పరికరాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాకర్స్ క్లబ్, ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, నాయకులు భీష్మాచారి మాట్లాడుతూ.. ఓపెన్ జిమ్‌లపై అధికారుల పర్యవేక్షణ లోపించిందన్నారు. దాంతో పలు పరికరాలు దెబ్బతిన్నాయని, వెంటనే వాటికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతా.. : కార్పొరేటర్

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నిహారికగౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్

జవహర్‌నగర్, జనవరి 17: అభివృద్ధి పనులతో డివిజన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ నిహారికగౌడ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ 28వ డివిజన్ కార్పొరేటర్ నిహారికగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) రూ. 22లక్షలతో అయ్యప్ప కాలనీ, లక్ష్మీనర్సింహకాలనీలో శుక్రవారం భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బూడిద వెంకటేశ్, సీనియర్ నాయకులు రమేశ్‌చారి, మహేందర్‌యాదవ్, చెన్నారెడ్డి, అనిల్ ముదిరాజ్, కేకే చారి, అశోక్, దివాకర్, కిశోర్, నరేశ్, విజయలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్ తాహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

ఘట్‌కేసర్, జనవరి 17 : ప్రభుత్వం క్రైస్తవుల శ్మశానం కోసం కేటాయించిన స్థలంలో కొందరు అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్ మండలం మాదారం గ్రామంలో సర్వే నెంబర్ 195/2లో క్రైస్తవుల శ్మశానం కోసం గత ప్రభుత్వం 5 ఎకరాల స్థలం కేటాయించిందన్నారు. ఆ భూమిలో ఓ వ్యక్తి ఫెలోషిప్‌గా ఏర్పడి క్రైస్తవ సమాజానికి తెలియకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. తవ్వకాలను నిలిపివేసి ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వారిలో సుందర్‌రావు, రాజేశ్, ఎఫ్రాయిమ్, మార్టిన్, సునీల్, బీఎస్ కేఫా తదితరులు ఉన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్, జనవరి 17 : ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు.. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధి అవుషాపూర్ సమీపంలోని రైలు పట్టాలపై నగరంలోని ఎంజీ బస్‌స్టేషన్ సమీపంలోని ఖాళీఖబర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వై. అనిల్‌కుమార్(45) ఉదయం ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయల్దేరి అవుషాపూర్ చేరుకున్నాడు. రైలు పట్టాలకు కొద్ది దూరంలోని చెట్ల పొదల మధ్య ద్విచక్రవాహనాన్ని నిలిపి సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపారు. కాగా అనిల్‌కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

వృద్ధుడు అదృశ్యం

అదృశ్యమైన నర్సింగరావు(ఫైల్)

జవహర్‌నగర్, జనవరి 17: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి యాప్రాల్‌లో ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం... యాప్రాల్‌లోని శైలిగార్డెన్ ప్రాంతంలో జొన్నపల్లి నర్సింగరావు(72) కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. నర్సింగరావు బ్రెయిన్‌ట్యూమర్‌తో బాధపడుతూ ఇంటి వద్దనే ఉండేవాడు. ఈనెల 17న కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా.. నర్సింగరావు ఉదయం గేటు తాళం తీసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబసభ్యులు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదగాళ్ల అరెస్టు

మూసాపేట: పేకాట ఆడుతున్న 14 మందిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అర్ధరాత్రి 1:30 గంటలకు మూసాపేటలో సీతారాం జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు దాడి చేసి నిర్వాహకుడు, 13 మందిని అదుపులోకి తీసుకొని, రూ.లక్షా 71 వేలు, 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలి

● జిల్లా ప్రత్యేకాధికారి శశాంక్ ఐఏఎస్

● శామీర్‌పేట, తూంకుంటలో రేషన్‌కార్డుల సర్వే పరిశీలన



తూంకుంటలో రేషన్‌కార్డుల సర్వే, ఎలివేటర్ కారిడార్ భూ సేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ప్రత్యేకాధికారి శశాంక్ ఐఏఎస్, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట, జనవరి 17 : సంక్షేమ పథకాలను అర్హులకు అందించే దిశగా జిల్లా యంత్రాంగం పని చేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రత్యేకాధికారి శశాంక్ ఐఏఎస్ సూచించారు. శుక్రవారం శామీర్‌పేట తాసీల్దార్ కార్యాలయం, అలియాబాద్, తూంకుంట మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారి శశాంక్ పర్యటించారు.

శామీర్‌పేట తాసీల్దార్ కార్యాలయంలో సంక్షేమ పథకాలపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వివరాల సేకరణ, పొందుపరిచే విధానాన్ని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూములు వ్యవసాయయోగ్యమైనవా? కాదా? అని గుర్తించి నివేదికలు తయారు చేయాలన్నారు. ఫైనల్‌గా తాసీల్దార్ సమగ్ర నివేదికను పరిశీలించాలని, గుట్టలు, రాళ్లు, లే అవుట్లు, కళాశాలలు, గోదాములు, ఫౌల్ట్రీ, ఇటుక బట్టీల వంటి వాటినొ వ్యవసాయేతరం భూములుగా చూపించాలన్నారు. గ్రామ స్థాయిలో సభలు, మున్సిపాలిటీలో వార్డు సభలను పక్కాగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ఆయా భూములకు ప్రభుత్వం ఎకరాకు రూ.6 వేల చొప్పున రెండు విడతలుగా రైతు భరోసా చెల్లిస్తుందన్నారు.

జిల్లాలో 12,243 రేషన్‌కార్డుల దరఖాస్తులు ఉన్నాయని వాటిని సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ దరఖాస్తు దారు పద్మ ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తూంకుంట రాజీవ్ రహదారిపై జేబీఎస్ నుంచి శామీర్‌పేటవరకు ఎలివేటర్ కారిడార్ నిర్మాణ పనులకు భూ సేకరణపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజేందర్ రెడ్డి, డీఆర్‌డీవో సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా ఫౌరసరఫరా అధికారి సుగుణాబాయి, హౌసింగ్ పీడీ రమణామూర్తి, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, తాసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీవో మమతాబాయి, మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠధామాల్లో సౌకర్యాల కల్పనకు కృషి

నారపల్లిలోని వైకుంఠ ధామంలో పరిశుభ్రత పనులను పరిశీలిస్తున్న పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం, జనవరి 17 : పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వైకుంఠ ధామాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి తెలిపారు. నారపల్లిలోని వైకుంఠధామంలో నిర్వహించిన పరిశుభ్రత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచారం మున్సిపాలిటీ పరిధిలో పోచారం, నారపల్లి, యంనంపేట్, అన్నోజిగూడ,లక్ష్మినర్సింహ కాలనీల్లోని వైకుంఠ ధామాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే నీటి సౌకర్యం, స్నానపు గదులు, విద్యుత్ దీపాలు, పరిశుభ్రత, కుర్చీల ఏర్పాటు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా బంద్

కీసర, జనవరి 17; రాంపల్లిదాయర సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు ఏఈ మురళీకృష్ణ తెలిపారు. రాంపల్లిదాయర, అగ్రికల్చర్, కీసరదాయర గ్రామాలకు, యాద్గార్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు చీర్యాల్ గ్రామం, బాలాజీ ఎన్‌క్లేవ్, ఎంఎల్ఆర్ కాలనీ, గణేశ్ టౌన్‌షిప్, ఎన్ఎస్ఆర్ బృందావన్ కాలనీ, ఎస్ఎల్ఎన్ కాలనీ, గాంధీ బొమ్మ, టీపీఎస్ పుష్ప నగర్, రామారావు అగ్రికల్చర్ ఏరియాల్లో, కరీంగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11గంటల వరకు, కీసర టౌన్ 11కేవీ ఫీడర్‌లో ఉదయం మధ్యాహ్నం 1.30 నుంచి 2గంటల వరకు, యాద్గార్‌పల్లి 11కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 2.30గంటల వరకు యాద్గార్‌పల్లి, చిత్తారమ్మ టెంపుల్, రామస్వామి కాలనీ, ఎస్సీ కాలనీ తదితర గ్రామాల్లో విద్యుత్ కోత విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

రామంతాపూర్ పరిధిలో...

రామంతాపూర్ : కల్యాణపురి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నిఖిల్ తెలిపారు.జహీదన్‌నగర్, బ్యాంక్ కాలనీ,ఇందిరానగర్, అంబేద్కర్‌నగర్, సీతారంకాలనీ, ఈస్ట్ అండ్ నార్త్ కల్యాణపురి కాలనీల్లో బాలాజీ ఎన్‌క్లేవ్, రాఘవేంద్రాకాలనీ,టీచర్స్ కాలనీ అజ్మత్‌నగర్, విస్తారా ఎన్‌క్లేవ్, తదితర ప్రాంతాల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

శామీర్‌పేట పరిధిలో..

శామీర్‌పేట : విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శామీర్‌పేట ఏఈ రాఘవేందర్ రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ శామీర్‌పేట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ శామీర్‌పేట ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దాంతో బాబాగూడ, బొమ్మరాశిపేట గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాలకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మందాయిపల్లి, దేవరయాంజాల్‌లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

పోచారం మున్సిపాలిటీ పరిధిలో..

పోచారం : మున్సిపాలిటీ నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. అన్నోజిగూడ ఫీడర్ పరిధిలో అన్నోజిగూడ, లక్ష్మినర్సింహ కాలనీ, ఎల్ఐజీ కాలనీ, ఇందిరానగర్,జయపూర్ కాలనీ, సత్యానగర్,సాయినగర్ కాలనీ, అన్నోజిగూడ పాత గ్రామంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 2 నుంచి 2:30 గంటల వరకు పోచారం, డాక్టర్స్ కాలనీ, విజయసాయి కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ వివరించారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన గణేశ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నార్త్ ఈస్ట్ యూనివర్సిటీ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో రాష్ర్టానికి చెందిన గణేశ్ సత్తాచాటాడు. శుక్రవారం జరిగిన పోటీల్లో లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ తరపున బరిలోకి దిగిన గణేశ్ స్నాచ్‌లో 126 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 168 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచాడు. మరోవైపు ఆల్ ఇండియా యూనివర్సిటీ నేషనల్స్ లోనూ ఐదో స్థానంలో నిలిచి ఆకట్టుకున్నాడు. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థి అయిన గణేశ్ గత కొన్నేండ్లుగా జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్నాడు. ఈ క్రమంలో లవ్లీ ప్రొఫెషనల్ యూణవర్సిటీలో సీటు దక్కించుకున్నాడు. గణేశ్ మరిన్ని విజయాలు సాధించి రాష్ర్టానికి, దేశానికి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

అధికారుల నిర్లక్ష్యం.. పొంగుతున్న డ్రైనేజీలు

కుషాయిగూడ డీమార్ట్ దారిలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

చర్లపల్లి, జనవరి 17 : అధికారుల పర్యవేక్షణ లోపంతో చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్లపై డ్రైనేజీ నీరు పారుతున్నా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కుషాయిగూడ డీమార్ట్ నుంచి శివసాయినగర్ ప్రధాన రహదారిలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి డ్రైనేజీ లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.